నిండుకుండలా జలాశయాలు

- ఎటూ చూసినా పచ్చని పైర్లు
- పెరిగిన భూగర్భ జలాలు
- కళకళలాడుతున్న పంటలు

ఎల్కతుర్తి : ఇటీవల భారీగా కురిసిన వర్షాలతో మండలంలోని జలవనరులు అన్ని నిండుకుండలా మారాయి. దీంతో భూగర్భ జలాలు అమాంతంగా పెరిగి వ్యవసాయ బావుల్లో పుష్కలంగా నీటిమట్టం పెరిగింది. అలాగే ఎస్సారెస్పీ కాలువ నీరు సైతం వస్తుండడంతో మండలవ్యాప్తంగా సాగు చేసిన పంటలు పచ్చదనంతో నిండుకొని కళకళలాడుతున్నాయి. వరిపంటలో వస్తున్న తెగుళ్ల నివారణకు రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మండలంలో సాగు విస్తీర్ణం..

మండలంలో మొత్తం 19 గ్రామ పంచాయితీలకు గాను మరో మూడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటికి 21,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ఇందులో 16,050 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. 4,080 ఎకరాల్లో పత్తిపంట, 243 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా మిగతా ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో పది గ్రామాలు ఎస్సారెస్పీ ఆయకట్టు కింద ఉండగా మరో తొమ్మిది గ్రామాలు పూర్తిగా మెట్ట ప్రాంతంలో ఉన్నాయి. మెట్ట ప్రాంతం రైతులు పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేయగా ఎస్సారెస్పీ ఆయకట్టు కింది రైతులు పూర్తిస్థాయిలో వరి సాగు చేశారు. రైతులు సాగు చేసిన పంటలు ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. అక్కడక్కడా వరిపంటలో ఎండురోగం వస్తుందని రైతులు అంటున్నారు.

వరిపంటలో ఎండురోగం తెగుళ్లు

స్థానిక ఎస్సారెస్పీ ఆయకట్టు కింద రైతులు సాగుచేసిన వరిపంటలో అక్కడక్కడా ఎండు రోగం వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో వరిపంటను పరిశీలించి పంటకు సోకిన ఎండురోగం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.



మెట్టప్రాంతంలో నిండుకుండలా గోపాల్‌పూర్ ఊరచెరువు



పచ్చదనంతో కళకళలాడుతున్న పత్తి చేను

రైతులు సూచనలు పాటించాలి



పత్తిలో రసంపీల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. దీని నివారించేందుకు థయామీ దాగ్జిన్ ఎకరాకు 40 గ్రాముల 200 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. వరిలో ఎండురోగం నివారణకు బ్లెక్టైటాక్స్ అరకిలో, ప్లాంటోమైసిన్ 80 గ్రాములు చెట్టు మొదలు దగ్గరవేసి నివారించవచ్చన్నారు. వరి లో కాండం తొలుచు పురుగు నివారణకు కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరాకు 30 గ్రాములు స్ప్రే ద్వారా పిచికారీ చేయాలన్నారు. కార్బాఫి రోనా 34 గుళికలు ఎకరాకు 10కిలోల చొప్పున చల్లుకోవాలి.

– రాజ్‌కుమార్, ఏఓ, ఎల్కతుర్తి

సంపూర్ణ ఆరోగ్యానికి జాగ్రత్తలు తీసుకోవాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా

దామెర: సంపూర్ణ ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎండీ.యాకూబ్‌పాషా సూచించారు. మండలంలోని ఊరుగొండలో నిర్వహించిన ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు(ఐఎంఐ), ఎన్‌సీడీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గర్భిణులు 84 రోజులలోపు టీడీ ఇంజక్షన్ తీసుకొని రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధిక పౌష్టికాహారం తీసుకోవడం మూలంగా శిశువు ఆరోగ్యంగా ఎదుగుతాడని పేర్కొన్నారు. 30 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌సీడీ కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సబ్ హెల్త్ సెంటర్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఎంఓ ఆశోక్‌రెడ్డి, డాక్టర్ సాహితీ, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్‌ఎంలు పద్మ, శోభారాణి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దామెర : ఊరుగొండలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న యాకూబ్‌పాషా

పౌష్టికాహారం తీసుకోవాలి

శాయంపేట : గర్భిణులు, తల్లులు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, తీసుకోవడం వలన బిడ్డ ఎదుగుదలే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ విద్యశ్రీ అన్నారు. మండలంలోని సాధోనిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జాతీయ పోషణ మాసం పురస్కరించుకొని పౌష్టికాహారం, ఆకుకూరలపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాణి, ఏఎన్‌ఎం రజినీ, హెచ్‌ఎం మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోవాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ హిమబిందు

కమలాపూర్: రెండు వారాలకు మించి దగ్గు, జ్వరంతో పాటు టీబీ లక్షణాలు ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని డీటీసీఓ డాక్టర్ హిమబిందు సూచించారు. హెల్త్ మేళా సందర్భంగా మండలంలోని శనిగరం, కానిపర్తి గ్రామాల్లోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను బుధవారం ఆమె సందర్శించారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, దగ్గినప్పుడు రక్తం పడటం లాంటి వాటితో బాధపడుతున్న వారిని గుర్తించి పూర్తి వైద్య పరీక్షల నిమిత్తం కమలాపూర్‌లోని పీహెచ్‌సీకి పంపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, గతంలో కోవిడ్ సమస్యలు, టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు, రెండు వారాలకు మించి దగ్గు, జ్వర సమస్యలతో బాధపడుతున్న వారు కమలాపూర్ పీహెచ్‌సీలో ఉచితంగా టీబీ పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షిణిప్రియ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రోహిత్‌కుమార్, డాక్టర్ అరుణ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రమౌళి, హెల్త్ అసిస్టెంట్లు ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



కమలాపూర్ : ధర్నా చేస్తూ టైర్లు దహనం చేస్తున్న నాయకులు



ధర్మసాగర్ : ధర్నా చేస్తున్న ఎంఎస్పీ శ్రేణులు

కమలాపూర్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదింపజేసి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో బుధవారం మహాధర్నా నిర్వహించి టైర్లు దహనం చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం తర్వాత ఆ విషయమే మర్చిపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు, ఎమ్మెస్పీ జిల్లా నాయకులు చిలువేరు సంపత్, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ బొచ్చు తిరుపతి, నాయకులు మొగిలి, ప్రసాద్, స్వామి, రమేష్, అనిల్, శ్రీను, రాము, అఖిల్, అరుణ్, నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : బీజేపీ ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, తక్షణమే ఈ పార్లమెంట్ సమావేశంలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. మండల పరిధిలోని హైదరాబాద్, భూపాలపట్నం జాతీయ రహదారిపై ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పాడిశెట్టి ప్రతాప్, పాడిశెట్టి సురేందర్, చిలుక రాజు, అన్వేష్, బాబు, అభిషేక్, సది, ఎల్లస్వామి, భాస్కర్, వెంకటేష్, సాంబి, బాబు, సామ్యేల్, పాల్గొన్నారు. వేలేరులో అమరవీరుల స్తూపం వద్ద ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ రాజయ్య ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ రామంచ యేసు, గౌరవ అధ్యక్షుడు జిల్లెల పెరుమయ్య, శంకర్, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ చేయూత



ఆత్మకూరు: బాధిత కుటుంబానికి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆర్థిక తోడ్పాటునందించింది. మండలంలోని నీరుకుళ్లలో ఇటీవల ఫొటోగ్రాఫర్ పుచ్చ రాజు అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబానికి ఆత్మకూరు ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ద్వారా బుధవారం ఆర్థికసాయం అందించారు. కుటుంబ భరోసా స్కీమ్ ద్వారా రూ.1.55 లక్షలు, రాష్ట్ర సభ్యత్వం ద్వారా రూ.20వేలు, స్థానిక ఫొటోగ్రాఫర్ల ద్వారా రూ.32వేలు మొత్తం రూ.2.7 లక్షలు రాజు తల్లిదండ్రులకు అందచేశారు. కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. అందజేసిన వారిలో జిల్లా అధ్యక్షుడు గాదె లింగమూర్తి, మండల అధ్యక్షుడు వెల్దె లక్ష్మణ్, కార్యదర్శి కక్కెర్ల కమలహాసన్, జిల్లా కార్యదర్శి దయాకర్, సత్యనారాయణ, కందికొండ శ్యామ్, బిల్ల రమేష్, ఓదెల సదానందం, కోటి శ్రీను, పైడి తదితరులు ఉన్నారు.

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఘనత కవితదే



ఆత్మకూరు: కవిత ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ సుమలత, తదితరులు



దామెర : ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీటీసీ కల్పన కృష్ణమూర్తి

ఆత్మకూరు: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఘనత ఎమ్మెల్సీ కవితదేనని ఎంపీపీ మార్క సుమలత అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా నాయకులు కొమ్ముల సుమన్, మార్క రజనీకర్, ఐకేపీ ఏపీఎం లలిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దామెర: మహిళా రిజర్వేషన్ బిల్లు సాధనలో ఎమ్మెల్సీ కవిత కృషి వెలకట్టలేనిదని జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్‌అలీ, పీఏసీఎం చైర్మన్ బొల్లు రాజు, ఎంపీటీసీ కృపాకర్‌రెడ్డి, సర్పంచ్ రాజేశ్వరీ ఈశ్వర్, రఘుపతిరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

‘స్వీప్’లో వేలేరు విద్యార్థినికి మొదటి స్థానం



సాహిత్యకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్



ద్వితీయ బహుమతి గెలుచుకున్న విద్యార్థినులు

ధర్మసాగర్(వేలేరు): ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన హనుమకొండ జిల్లా స్థాయి స్వీప్ సాంగ్స్ అండ్ పోయమ్ పోటీల్లో వేలేరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని పల్లా సాహిత్యకు మొదటిస్థానం లభించింది. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ చేతుల మీదుగా బహుమతి, సర్టిఫికెట్ అందుకున్నారు. అదే విధంగా సాహిత్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాల హెచ్‌ఎం రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల బృందం సాహిత్యని, తెలుగు ఉపాధ్యాయురాలు పోతుల ఉమాదేవిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

గట్లనర్సింగాపూర్ విద్యార్థినుల ప్రతిభ

ఎల్కతుర్తి: హన్మకొండ కలెక్టరేట్‌లో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఓటు విలువ తెలిపే స్కిట్‌లో జిల్లాస్థాయిలో భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి ద్వితీయ బహుమతి గెలుపొందారు. రాష్ట్రస్థాయిలో జరిగే కార్యాక్రమానికి పోటీ పడేందుకు అర్హత సాధించారు. కార్యక్రమంలో విద్యార్థినీలు శివానందిని, సింధు, ప్రియా, దుర్గాభవాని, అశ్రితసాయి, రాజశ్రీ పాల్గొన్నారు. విద్యార్థినీలను బుధవారం ప్రధానోపాధ్యాయులు మద్దెల కుమారస్వామి, ఎంపీపీ జక్కుల అనితరమేష్, సర్పంచ్ ఎర్రబెల్లి చంద్రకళ తిరుపతిరావు, విద్యాకమిటీ చైర్మన్ గాజుల కవిత, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

సూర్యనాయక్ తండాలో కార్డన్‌సెర్చ్



శాయంపేట : మండలంలోని సూర్యనాయక్ తండాలో బుధవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ తెలిపారు. గుడుంబా స్థావరాలపై దాడులు చేయగా 35 లీటర్ల నాటుసారా, 30 కేజీల చక్కెర, గుడుంబా తయారీకి ఉపయోగించే పౌడర్‌ను పట్టుకొని సీజ్ చేశారు. అజ్మీరా ప్రమీల, మాలోతు రాజు, మాలోతు భాస్కర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, విక్రయించిన పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాటుసారాను నిర్మూలించేందుకు గ్రామస్తులు, మహిళా సంఘాలు పోలీసులకు సహకరించాలని కోరారు. దాడుల్లో దామెర, ఆత్మకూరు ఎస్సైలు రాజేందర్, ప్రసాద్, రాకేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తే కూల్చివేస్తాం

పరకాల: శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే తామే కూల్చివేస్తామని బీజేపీ నాయకులు హెచ్చరించారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ కాంట్రాక్టర్, సిబ్బంది చేరుకోవడంతో ఆలయ కమిటీ సభ్యులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆలయం వద్దకు చేరుకొని ఆలయ కమిటీకి మద్దతుగా నిలిచారు. హిందువుల దేవాలయాలపై స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్‌కు చిన్నచూపు తగదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో ఆలయ అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, రాష్ట్ర నాయకుడు దేవునూరి మేఘనాథ్, వార్డు కౌన్సిలర్స్ ఆరీపీ జయంత్‌లాల్, పట్టణ ప్రధాన కార్యదర్శులుగా జుల నిరంజన్, విజయ్‌కుమార్, రూరల్ అధ్యక్షుడు పుట్ట రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

యువకుడిపై పోక్సో కేసు నమోదు

దామెర: యువకుడిపై పోక్సో కేసు నమోదైన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముస్త్యాపల్లి చెందిన ఒక మైనర్ బాలిక 9వ తరగతి చదువుతుంది. సమీప గ్రామమైన తక్కళ్లపాడ్‌కు చెందిన యువకుడు ఇన్‌స్టాగామ్‌లో బంధువునంటూ పరిచయం చేసుకున్నాడు. అనంతరం ఆ అమ్మాయిని మభ్యపెట్టి చాటింగ్ చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఆ బాలికకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా కలుసుకోవడంతో పాటు, బాలిక వద్ద నుంచి రూ. 65 వేలు తీసుకున్నాడు. ఈ నెల 17న మరోసారి బాలిక ఇంటికి వచ్చి మాట్లాడుతుండగా గమనించిన బాలిక తల్లిదండ్రులు నిలదీయడంతో బాలిక భయపడుతూ జరిగిందంతా తల్లిదండ్రులకు వివరించింది. తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

దామెర: మండల కేంద్ర సమీపంలో బుధవారం ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ఆటో హనుమకొండ వైపు ప్రయాణికులను తీసుకొని వెళ్తున్న క్రమంలో మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో అదుపుతప్పి బోల్తాకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలువుకి స్వల్పగాయాలు కాగా సమీపంలో ఉన్న ఎస్ఎస్ఆర్ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు పనులను అడ్డుకున్న బోయ కులస్తులు



కాలనీవాసులతో మాట్లాడుతున్న సుమన్

శాయంపేట : మండల కేంద్రంలోని బోయకాలనీకి వెళ్లే దారిలో జరుగుతున్న రోడ్డు పనుల్లో వరద కాలువ నీరు వెళ్లే పైపులైన్ తొలగించారు. కొత్త పైపు లైన్ వేస్తామని చెప్పి వేయకుండా రోడ్డు పనులు చేపడుతుండడంతో ఆగ్రహించిన బోయ కులస్తులు బుధవారం పనులను అడ్డుకున్నారు. సుమారు రెండుగంటల పాటు రోడ్డుపై బైఠాయించారు. పైపు లైను వేయకుండా రోడ్డు నిర్మాణం చేపడుతే కాలనీ నుంచి వచ్చే వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుందని దీంతో ప్రజలకు ఇబ్బందిగా మారుతుందని ఆగ్రహించారు. విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్ అక్కడికి చేరుకొని కాలనీవాసులతో మాట్లాడి పైపులైన్ వేశాకే రోడ్డు నిర్మాణం చేపడుతామని చెప్పి కాలనీవాసులను శాంతిపజేశారు. ఉపసర్పంచ్ హామీతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

ముగ్గుల పోటీలు



ధర్మసాగర్ : స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ హనుమకొండ స్వచ్ఛత హీ సేవా సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కేశవనగర్‌లో క్యాతంపల్లి, జానకిపురం, సాయిపేట, కేశవనగర్ గ్రామాల మహిళలకు ముగ్గుల పోటీలు, ర్యాలీ, క్విజ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గె లుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ రవి, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, ఎంపీఓ కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఈజీఎస్ ఏపీఓ, ఈసీ, టీఏ, ఎస్‌బీఎం ప్రతినిధి సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

శాయంపేట : బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గిద్దమారి సురేష్ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో బుధవారం హనుమకొండలోని జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయలంలో బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్, శాయంపేట సర్పంచ్ కందగట్ల రవి, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, శాయంపేట ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, నాయకులు సదానందం, సాంబయ్య, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జేబుదొంగలు

పరకాల : స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం సందర్భంగా ఉండే రద్దీని దృష్టిలో ఉంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు జేబు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రమాణస్వీకారోత్సవ సమయంలో ఆరుగురి జేబులో నుంచి డబ్బులు దొంగతనం చేయడంతో అప్రమత్తమైన పోలీసులు మార్కెట్ ఆవరణంలో నిఘా పెట్టారు. అనుమానితులుగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కొంత నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

గౌడసంఘం కమిటీ ఎన్నిక

ఆత్మకూరు: మండలంలోని పెద్దాపూర్ గౌడ సంఘం కమిటీ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా కక్కెర్ల సాంబయ్య, ఉపాధ్యక్షుడిగా గట్టు వేణు, డైరెక్టర్లుగా బత్తిని వీరస్వామి, కక్కెర్ల పెద్ద కుమారస్వామి, లక్ష్మీనారాయణ, ధర్మపురి రమేష్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యుడు మాట్లాడుతూ గౌడకులస్తుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



నడికూడ: మండలంలోని చర్లపల్లిలో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో కుట్టు మిషన్ శిక్షణ తీసుకున్న మహిళలకు మంగళవారం బీఆర్‌ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యులు నందికొండ జయపాల్‌రెడ్డి ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గణపతి రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు బొల్లారం అనిల్ కుమార్, దేవేందర్, మహ్మద్ ఇబ్రహీం, శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్, శివ కృష్ణ, రాజ్ కుమార్, దూడ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి మృతితో విషాదం

పరకాల: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఆకినపల్లి ప్రేమ్‌చంద్ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరా బాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం తెల్లవారుజా మున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన సన్నిహితులు తెలిపారు. ప్రేమ్‌చంద్ మృతదేహానికి వ్యాపారస్తులు, ప్రముఖులు, తదితరులు నివాళులర్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఐనవోలు: మండలంలోని పున్నేలుకు చెందిన ఎక్కల భీమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రమేష్ బుధవారం హైదరాబాద్‌లో ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

ఓటింగ్ మిషన్‌పై అవగాహన

పరకాల: ప్రజాస్వామ్యంలో ఎంతో పవిత్రమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. కళాశాలలో ఈవీఎం(స్వీప్) అవగాహన సదస్సు నిర్వహించారు. మాక్ ఓటింగ్ నిర్వహించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ఎలా పనిచేస్తుందో వివరించారు. ఆర్‌ఐ రవీందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి జి.ఓదేలు, ఎం.రవికుమార్, అరుణ, నవీన్, అశోక్‌మోరె, సుస్మిత, పి.సుభాషిణి, జి.స్వప్న, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కోతుల బెడదను అరికట్టాలి

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో కోతుల బెడదను అరికట్టాలని కోరుతూ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ గత కొంత కాలంగా ఉప్పల్‌లో కోతులు ఎక్కువై ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. తరచూ ప్రజలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని, ఇప్పటి వరకు కోతుల దాడిలో సుమారు 20 మంది వరకు గాయపడ్డారని, రైతులకు పంట నష్టం కలిగించడంతో పాటు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగించే గౌడ కులస్తులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు, గౌడ కులస్తుల ఆవేదనను అర్థం చేసుకుని కోతులను అరికట్టి కాపాడాలని కోరా రు.

పేద విద్యార్థులకు చేయూత

ధర్మసాగర్: మండలంలోని పలు గ్రామాల్లోని నిరుపేద విద్యార్థుల చదువు కోసం కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం ఆర్థిక సాయం అందించాలని కడియం ఫౌండేషన్ వారిని కోరగా తమ వంతు సహా యంగా మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బుధవారం విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని తాటికాయలకు చెందిన ఎర్ర దిలీప్ ఎంబీబీఎస్ చదువుకు, అదేవిధంగా ఎడ్ల వంశీ ఇంటర్మీడియట్ విద్యకు, ధర్మసాగర్‌కు చెందిన బొడ్డు వైశాలి ఫాతిమా స్కూల్‌లో చ దువు నిమిత్తం తమ వంతుగా ఆర్థికసాయం అందించారు. సర్పంచ్‌లు పెసరు రమేష్, ఎర్రబెల్లి శరత్, నాయకులు ప్రదీప్ కుమార్ ఉన్నారు.

ప్రత్యేక పూజలు

ధర్మసాగర్ : మండల కేంద్రంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గ్రా మంలోని గణపతి మండపాల వద్ద గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రెడ్డి కాలనీలో స్ఫూర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు హైమావతి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

గండ్ర దంపతులను కలిసిన వర్కింగ్ ప్రెసిడెంట్

శాయంపేట : బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ బుధవారం హనుమకొండలోని జిల్లాపరిషత్ క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతిలను కలిశారు.